క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం

అమరావతి/పెదకూరపాడు : ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు అమరావతిలోని ఏవీఆర్ కల్యాణ మండపంలో, అలాగే ఉదయం 10 గంటలకు పెదకూరపాడులోని లాల్ జాన్ బాషా షాదీ ఖానాలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అమరావతి మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, పెదకూరపాడు మండల అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరావుతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



రాజుపాలెం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్ తెలిపారు. మండలంలోని మొక్కపాడులో డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఈ నెల 30వ తేదీ లోపు ఇంటింటికి వెళ్లి డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ రవితేజ నాయక్ సూచించారు. తీవ్రమైన జ్వరం, తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, చర్మంపై దద్దుర్లు ఉంటే డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శివ మాధవి, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): పిడుగుపాటుకు గుర్రై గేదె, దూడ మృత్యువాత పడిన ఘటన మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన నడికట్టు మస్తానమ్మ గేదెలు మేపేందుకు దక్షిణం వైపు పొలాలకు వెళ్లింది. సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావటంతో ఇంటికి బయలు దేరింది. మార్గమధ్యలో పిడుగు పడటంతో గేదె, పక్కనే ఉన్న మరో దూడ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. పిడుగుపాటుకు మస్తానమ్మ కూడా కింద పడిపోయింది. ఆమె కంటిచూపు కొద్దిగా లోపించినట్లు గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన గేదెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం



అచ్చంపేట: సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు మేలైన సౌకర్యాలు అందజేస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా కొప్పురావూరి కోటేశ్వరరావు ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, తక్కువ వడ్డీతో రుణాలు, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందచేస్తామన్నారు. అనంతరం నూతన చైర్మన్‌గా కొప్పురావూరి కోటేశ్వరరావు, డైరెక్టర్స్‌గా షేక్ ఖాజావలి, కొరివి నరసింహారావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, వెన్నా సాంబశివారెడ్డి, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయ్, మాదిపాడు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అచ్చంపేటలో ఏడాది టీడీపీ పాలనపై తొలిఅడుగు కరపత్రాలను పంపిణీ చేశారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

సత్తెనపల్లి: వరకట్న వేధింపులపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం గ్రామానికి చెందిన మాధవికి, యడ్లపాడుకు చెందిన బండారు శ్రీనుకు 2021లో వివాహమైంది. నాలుగేళ్లపాటు అన్యోన్యంగా జీవించిన వారికి ఓ కుమార్తె ఉంది. గత కొంత కాలంగా అధిక కట్నం కోసం వేధించడంతో మాధవి పుట్టింటికి వచ్చింది. భర్త, అత్త, బావలపై ఫిర్యాదు చేయడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ నాయకులు



క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం
- ఏడాది గడిచినా హామీల ఊసే లేదు
- ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి
- మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలోని కల్యాణ మండపంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంపై మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా హామీల అమలు ఊసు ఎత్తడం లేదని విమర్శించారు. సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు దూరం చేసి, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు చన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బద్దూరి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శులు మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, గాదెమిల్లు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, కో ఆప్షన్ మెంబర్ దరియా, సర్పంచులు నరసింహ నాయక్ కంభంపాటి పాప, రమణారెడ్డి, సైదయ్య, బాబుజి, శేషిరెడ్డి, నాయకులు మౌలాలి, భద్రయ్య, మేకల వెంకటేశ్వర్లు, సిరిపురం మేస్త్రీ, వేల్పుల కోటేశ్వరరావు, రేగుల గడ్డ శ్రీను, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

21 నుంచి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై గ్రామాల్లో ప్రచారం

క్రోసూరు: ఈ నెల 21వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై గ్రామాలలో ముమ్మర ప్రచారం చేద్దామని పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో క్రోసూరు, అచ్చంపేట మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించి ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నంబూరు శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్‌సిక్స్ అంటూ అలవి కాని అబద్ధాల హామీలతో ప్రజలకు ఆశ కల్పించి అధికారం చేపట్టాక ఏ విధంగా ప్రజల్ని మోసం చేసిందో ఇంటింటికీ వెళ్లి తెలియజేద్దామన్నారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీపై, మాజీ సీఎం జగన్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేసి అధికారంలో వచ్చిన కూటమి అన్ని వర్గాల ప్రజల్ని ఏ విధంగా మోసగించిందో ప్రచారం చేపడదామని అన్నారు. ఆగస్టు 4వ తేదీ వరకు 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడదామన్నారు. కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీటీసీ జమీలాగపూర్, గార్లపాటి దాసు, పట్టేల శ్రీనివాసరావు, అనుముల కోటిరెడ్డి, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ చిల్కా రవి, షేక్ ఖాదర్, క్రోసూరు మాజీ జెడ్పీటీసీ చిల్కా పెద బాబు, అచ్చంపేట మండల అధ్యక్షుడు చిలకా చంద్రయ్య, చల్లగరిక బాబు, నెల్లూరి చంద్రబాబు, కె.రమేష్, క్రోసూరు, అచ్చంపేట మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శి హనుమంతరావుపై దాడి దుర్మార్గం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవిబాబు



హనుమంతరావుపై దాడిని ఖండిస్తూ కరపత్రాలు పంపిణీ చేసిన సీపీఎం నాయకులు

దొడ్లేరు(క్రోసూరు): ప్రజా సమస్యలపై పని చేస్తున్న సీపీఎం క్రోసూరు మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావుపై టీడీపీ మండలం అధ్యక్షుడు మొగల్ జాన్ అతని తమ్ముడు దాడి చేయడాన్ని ప్రజలు తీవ్రంగా ఖండించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. గురువారం దొడ్లేరు గ్రామంలో సీజీజీబీ బ్యాంక్‌లో బంగారం కోల్పోయిన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సీపీఎం పార్టీ దొడ్లేరు గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పని చేస్తున్నట్లు తెలిపారు. అమరావతి-బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల గ్రామంలో ఇళ్లు, ప్రహరీ గోడలు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయం చూడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ప్రజలకు నష్టం జరగకుండా విస్తరణ పనులు చేయమని చెప్పడం జరిగిందని.. అదే విధంగా చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకులో బంగారం తనఖా పెట్టుకున్న అప్పటి బ్యాంకు అప్రైజర్ నాగార్జున, బ్యాంక్ అధికారులు, మరి కొంతమంది చేసిన మోసం వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పోరాటాలలో కీలకంగా ఉన్న హనుమంతరావుపై దాడి చేయడం దుర్మార్గమని ఈ దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. టీడీపీకి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే అప్రజాస్వామికంగా ఆటవిక సంస్కృతికి పాల్పడిన మొగల్ జాన్‌పై చర్యలు తీసుకొని మండల అధ్యక్షుడు స్థానం నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



బెల్లంకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమింపబడిన బెల్లంకొండ మండలానికి చెందిన చన్నపరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, అమరావతి మండలానికి చెందిన కొండవీటి కోటేశ్వరరావులను మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవులు రావడం హర్షణీయమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వెంకటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల పెరుగుదలకు ఉపాధ్యాయులదే కీలకపాత్ర

డీఈవో చంద్రకళ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. గురువారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్ననటువంటి సంసిద్ స్కూల్లో జిల్లా స్థాయిలో 227 మంది ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై జరుగుతున్న శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయాభావం, క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. 60 మంది విద్యార్థుల సంఖ్య దాటిన ప్రైమరీ స్కూల్స్ జిల్లాలో 463 ఉండగా ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు పర్యవేక్షణలో ప్రత్యేకంగా బోధిస్తున్నారన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవటం ద్వారా ప్రతి పాఠశాల్లో విద్యార్థుల హాజరు శాతం నూరు శాతం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రానున్న మూడు నెలల వ్యవధిలో ప్రతి విద్యార్థి చదవటం రాయడం గణితంలో చతుర్విద ప్రక్రియలను చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకుని తగినరీతిలో బోధించాలన్నారు. ఉపవిద్యాశాఖాధికారి సుభాని, ఎంఈవో పుసులూరి లలిత కుమారి, ఏయంవో పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



నాదెండ్ల: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు, పాన్, ఆధార్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. మండలంలోని గొరిజవోలు గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జి.పుల్లారావు మాట్లాడుతూ రోజురోజుకు ఆన్‌లైన్, సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు చెప్పకూడదన్నారు. అదే విధంగా గంజాయి, మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, స్నేహాలను గమనిస్తూ వారు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో మత్తుపదార్థాల సరఫరా, వినియోగం చేసే వారి గురించి పోలీసులకు తెలియజేయాలని, అలా తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ కక్షలు, రాజకీయ ప్రేరిత ఘర్షణలకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని కోరారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో...



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

చిలకలూరిపేట: బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్టీయూ సమావేశం గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సర్దుబాటు జరిగి నెల కావస్తున్నా జీతాల సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో జూన్ జీతాలు ఇంకా జమ కాలేదన్నారు. బదిలీలకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతితో పొజిషన్ ఐడీ క్రియేట్ చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. డీఎస్సీ-2003కు చెందిన వారు ఓపీఎస్ సాధనకు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎస్టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రాల్లో ఓపీఎస్ సాధన కోసం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వి.అక్కయ్య, సీహెచ్ మల్లేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, వి.అజయ్‌ప్రకాశ్, వి.రవి, సీహెచ్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి సుపరిపాలనలో తొలి తప్పటడుగు

నరసరావుపేట: కేవలం ప్రచార ఆర్భాటం కోసమే కుటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు అంటూ ప్రచారం చేస్తున్నారని అది ఒక తప్పటడుగని సీపీఏం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో బాబూరావు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. దీంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని వెల్లడించారు. విద్యుత్ ఛార్జీల పెంపు విషయంలో మరింత మోసపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఒకవైపు చార్జీలు పెంచుతూ రూ.450 కోట్ల సర్దుబాటు చార్జీలు వెనక్కి ఇస్తున్నామని బూటకపు మాటలు చెబుతున్నారని అన్నారు. ఏడాది కాలంలో నాలుగు రకాల సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,485కోట్లతో పాటు యూనిట్‌కు అదనంగా 40 పైసలు వసూలు వంతున ఏడాది కాలంలో రూ.2787కోట్లు వసూలు చేసి ఆషాఢం ఆఫర్ మాదిరి రూ.450 కోట్లను వెనక్కు ఇస్తున్నామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. స్మార్ట్‌మీటర్ల ప్రక్రియ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశించారని, గత ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. . రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వై.రాధాకృష్ణ, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి పాల్గొన్నారు.

తపాలా శాఖలో అధునాతన సేవలు

- 19 నుంచి 21వ తేదీ వరకు తపాలా సేవలు నిలిపివేత
- 22 నుంచి సేవలు పునః ప్రారంభం

నరసరావుపేటటౌన్: వినియోగదారులు ఇంటి నుంచే సేవల్ని పొందేలా ఈ నెల 22వ తేదీ నుంచి అధునాతన తపాలా సాంకేతికత విధానాన్ని అమలు చేయనున్నట్లు తపాలా శాఖ నరసరావుపేట డివిజన్ సూపరింటెండెంట్ మొహమ్మద్ జాఫర్ సాదిక్ గురువారం తెలిపారు. సేవల్లో సామర్థ్యం పెంపు, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వహణతో పాటు మెరుగైన ట్రాకింగ్‌తో వినియోగదారులకు సేవల్ని అందించడం నూతన సేవల ఉద్దేశం అన్నారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని 449 తపాలా కార్యాలయాల్లో ఈ విధానం అమలవుతుందని తెలిపారు. నూతన సంస్కరణలో భాగంగా ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వివరించారు. తేదీ 22.07.2025 నుంచి తపాలా కార్యాలయాల్లో సేవలు పునః ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

విత్తన దుకాణాలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- రూ.1,19,400 విలువ గల విత్తనాలు సీజ్
- 1.2 టన్నుల ఎరువులు సీజ్
- ముప్పాళ్ళలో రూ.35,400 విలువ గల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల



దొడ్లేరులోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు



ముప్పాళ్ళలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు బుజ్జిబాబు, వ్యవసాయ అధికారులు

క్రోసూరు: విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా క్రోసూరులోని లక్ష్మినరసింహ ఎంటర్‌ప్రైజెస్ విత్తనాల షాపులో అనుమతి పత్రాలు లేని కారణంగా రూ.1,19,400 విలువ కలిగిన విత్తన అమ్మకాలను నిలుపుదల చేశారు. దొడ్లేరు గ్రామంలోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్‌లో అనుమతి పత్రాలు లేని 1.2 టన్నుల ఎరువులను సీజ్ చేసి ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణ యజమానులు చట్ట ప్రకారం వ్యాపారాలు చేయాలని, నిబంధనలను అతిక్రమించితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అపర్ణ , సహాయ వ్యవసాయ సంచాలకులు (విత్తన పరీక్ష కేంద్రం), నెల్లూరు కన్నయ్య, క్రోసూరు మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్‌లు నిర్వహించాలని అంతర జిల్లా కమిటీ సభ్యులు వీ బుజ్జిబాబు చెప్పారు. మండల పరిధిలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం తనిఖీ చేశబూరు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు అంతర జిల్లా కమిటీ సభ్యులుగా నియమితులైన ఏలూరు జిల్లా కోటరామచంద్రాపురం సహాయ వ్యవసాయ సహాయకులు బుజ్జిబాబు, విజయవాడ రీజనల్ విజిలెన్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి, ముప్పాళ్ళ వ్యవసాయాధికారులు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డిలు బృందంగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా దుకాణాల్లో స్టాక్ బుక్స్, బిల్లులు, నిల్వలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా అమ్మకాలు జరుపుతున్న రూ.35,400 విలువ గల 41.6 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. స్టాక్ వివరాలను స్టాక్ బోర్డ్‌లో ప్రదర్శించాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న పురుగుమందులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, పాకెట్‌పై, కొనుగోలు రశీదుపై లాట్ నెంబర్ ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని మునగోడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

అమరావతి: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు అమర్చుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల రూరల్ కార్యదర్శి సయ్యద్ మొహిద్దీన్ వలి మాట్లాడుతూ అదానీ కంపెనీతో ఒప్పందాలు చేసుకొని ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. ఇప్పటికే పాత బకాయిల పేరుతో ప్రజలపై భారం మోపటం దారుణమన్నారు. ప్రీపెయిడ్ మీటర్లతో అదనపు బిల్లులు వసూలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. స్మార్ట్‌మీటరు బిగిస్తే సెల్‌ఫోను పద్ధతిలో ముందుగానే రీచార్జి చేసుకోవాలని దీంతో విద్యుత్ సంస్థల జవాబు దారీతనం లోపిస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండి..అడ్డుపడండి.. అని నారా లోకేష్ పిలుపునిచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఇంటి యజమాని అనుమతి లేకుండా మీటర్ బిగించే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు.

అదానీకి లాభం చేకూర్చేందుకు పని చేస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారపు శివనాగేశ్వరరావు



సత్తెనపల్లి: రాష్ట్రంలో అదానీ కంపెనీకి లాభాలను చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది రాజారపు శివనాగేశ్వరరావు అన్నారు. సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కట్టాల్సిన విద్యుత్ బకాయిలను ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.18 వేల కోట్లు విద్యుత్ భారాలను ప్రజలపై మోపారన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లను బిగిస్తే వాటిని పగలగొట్టాలని ప్రజలకు చంద్రబాబు, నారా లోకేష్ పిలుపునిచ్చారని, అధికారం చేపట్టిన తరువాత ఆ స్మార్ట్ మీటర్లను బిగించుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులు ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని, డబ్బు ఉంటేనే కరెంట్ సరఫరా అవుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు అంటే ప్రజలను దోపిడీ చెయ్యడమేనని, స్మార్ట్ మీటర్ల ఖర్చును వినియోగదారులు వాయిదాల రూపంలో చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

కారంచేడు దళిత మృతవీరుల్ని స్మరించుకుందాం

కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ



డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాచైతన్య యాత్రలో కేఎన్‌పీఎస్ కృష్ణ.

నరసరావుపేట: కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆగస్టు ఆరు చుండూరు వరకు దళిత మృతవీరుల్ని స్మరించుకుంటామని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. గురువారం గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజా చైతన్యయాత్ర ప్రారంభించారు. కృష్ణ మాట్లాడుతూ కారంచేడు నరమేధం జరిగిన నాటికి నేటికీ అగ్రకుల ఆధిపత్య కులాల శక్తుల చేతుల్లో ప్రతినిత్యం ఏదో ఒక చోట దళిత, పీడిత కులాల ప్రజలు దాడులు, హత్యలు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులతో పాటు ప్రజాస్వామికవాదులు, ఉద్యమ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కారంచేడు దళిత మృతవీరులకు నివాళులు అర్పించిన అనంతరం పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. కేఎన్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్నప్రసాదు, జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రాజశేఖర్, పీడీఎం సీనియర్ నాయకుడు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాస రావు, సామాజిక కార్యకర్త కృష్ణానాయక్, కేఎన్‌పీఎస్ సభ్యులు సుజాత ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

బొల్లాపల్లి: పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వాటిలోని రాగివైరు చోరీతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని అయ్యన్నపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని పొలాల్లో గత వారం రోజులుగా 8 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులోని రాగి వైరుతోపాటు మరికొన్ని ఉపకరణాలను అపహరించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తరచుగా మండలంలోని రేమిడిచర్ల సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని వస్తువుల చోరీకి పాల్పడటం జరుగుతుందని దీనిపై విద్యుత్ శాఖ, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.